నిధుల్లేక నిలిచిన పట్టణ ప్రగతి

- అత్యవసర సమస్యలపైనా స్పందించడంలేదు
- కమిషనర్‌పై కౌన్సిలర్ల అసహనం

సమావేశంలో మాట్లాడుతున్న బీఆర్ఎస్ కౌన్సిలర్లు

మెదక్ మున్సిపాలిటీ, జనవరి 10: బీఆర్ఎస్ ప్రభుత్వం పట్టణ ప్రగతితో ప్రతి నెలా మున్సిపాలిటీలకు నిధులు ఇవ్వడంతో సమస్యలు పరిష్కారమయ్యేవి. కాంగ్రెస్ ప్రభుత్వం వచ్చినప్పటి నుంచి పట్టణ ప్రగతి నిధులు నిలిపేయడంతో అభివృద్ధి పనులు నిలిచిపోయి, సమస్యలు పెరిగిపోయాయని బీఆర్ఎస్ కౌన్సిలర్లు మామిళ్ల ఆంజనేయులు, కృష్ణారెడ్డి, బట్టి లలిత అసహనం వ్యక్తం చేశారు. మెదక్ మున్సిపల్ చివరి సాధారణ సర్వసభ్య సమావేశాన్ని మున్సిపల్ చైర్మన్ చంద్రపాల్ అధ్యక్షతన శుక్రవారం నిర్వహించారు. ఎజెండాలోని అంశాలను చర్చిస్తూ సభ్యులు మాట్లాడారు. కాంగ్రెస్ ఎన్నికల్లో ఇచ్చిన హామీలను నెరవేర్చకపోవడంతో ప్రజలు తీవ్ర ఆందోళనకు గురవుతున్నారన్నారు. ప్రభుత్వ సంక్షేమ పథకాలు సైతం అమలు కావడం లేదన్నారు. బీఆర్ఎస్ ప్రభుత్వ హయాంలో పట్టణానికి ఇంటిగ్రేటెడ్ మార్కెట్, వైకుంఠధామం, రాందాస్ చౌరస్తాలో మున్సిపల్ కాంప్లెక్స్ నిర్మాణానికి నిధులు మంజూరు చేసిందని, మధ్యలోనే నిర్మాణాలు ఆగిపోయాయన్నారు. కూరగాయంల మార్కెట్‌లో నిర్మించిన రైతుబజార్, పోస్టాఫీస్ వద్ద చిరు వ్యాపారుల కోసం నిర్మించిన మార్కెట్ షెడ్డు సైతం ప్రారంభానికి నోచుకోలేదన్నారు. వార్డుల్లో నెలకొన్న అత్యవసర సమస్యలను కమిషనర్ శ్రీనివాస్‌రెడ్డి దృష్టికి తీసుకెళ్తే, వాటిని పరిష్కరిండం లేదని కౌన్సిలర్లు ఆరోపించారు. మున్సిపాలిటీలో విలీనమైన ఔరంగబాద్, ఆవుసులపల్లి గ్రామాలకు చెందిన ఇండ్ల మ్యుటేషన్లు కావడం లేదని, ఇంటి పర్మిషన్లు కూడా ఇవ్వడం లేదని కౌన్సిలర్లు సమావేశం దృష్టికి తీసుకొచ్చారు. మున్సిపాలిటీకి ప్రభుత్వం రూ.3.90 కోట్ల నిధులు మంజూరు చేసిందని చైర్మన్ చంద్రపాల్ అన్నారు. త్వరలోనే అభివృద్ధి పనులు పూర్తి చేస్తామని తెలిపారు. సమావేశంలో కౌన్సిలర్లు జయరాజ్, విశ్వం, లింగం, వసంత్‌రాజ్, మేఘమాల, కల్యాణి, మమత, జయశ్రీ, రుక్మిణి, లక్ష్మీనారాయణ, సులోచన, వనజ, శేఖర్, కోఆప్షన్ సభ్యులు గంగాధర్, ఉమర్, డీఈ మహేశ్, టీపీఎస్ భూపతి, శానిటరీ ఇన్‌స్పెక్టర్ మల్లికార్జున్, హెల్త్ ఇన్‌స్పెక్టర్ మహేశ్, సిబ్బంది పాల్గొన్నారు.

బీఆర్ఎస్ బలోపేతానికి కృషి చేయాలి

పార్టీ మెదక్ జిల్లా అధ్యక్షురాలు పద్మాదేవేందర్‌రెడ్డి


పద్మాదేవేందర్‌రెడ్డిని సన్మానిస్తున్న మాజీ సర్పంచ్‌లు

రామాయంపేట, జనవరి 10: బీఆర్ఎస్ పార్టీని బలోపేతం చేయాలని, స్థానిక సంస్థల ఎన్నికల్లో పార్టీ విజయభేరి మోగించాలని మాజీ సర్పంచ్‌లకు పార్టీ జిల్లా అధ్యక్షురాలు పద్మాదేవేందర్‌రెడ్డి సూచించారు. శుక్రవారం మండలంలోని మాజీ సర్పంచ్‌ల సంఘం ఆధ్వర్యంలో హైదరాబాద్‌లోని మాజీ ఎమ్మెల్యేను కలిసి సన్మానించారు. పద్మాదేవేందర్‌రెడ్డి మాట్లాడుతూ రాబోయే రోజులు బీఆర్ఎస్‌వేనని, కార్యకర్తలెవరూ నిరుత్సాహ పడొద్దన్నారు. జిల్లా వ్యాప్తంగా అన్ని మండలాలు, గ్రామాల్లో పాగా వేయాలన్నారు. కాంగ్రెస్ సర్కార్ ఆరు గ్యారంటీలను గాలికొదిలేసిందని, ఏ ఒక్క హామీని నెరవేర్చలేదన్నారు. మాజీ ఎమ్మెల్యేను కలిసిన వారిలో మాజీ సర్పంచ్‌లు సుభాష్‌రాథోడ్, శ్యాములు, మల్లేశం, స్వామి, సురేశ్, నాయకుడు ఉమామహేశ్వర్ తదితరులు ఉన్నారు.

వంద శాతం ఉత్తీర్ణత సాధించాలి: డీఈవో

చిన్నగొట్టిముక్ల పాఠశాలలో మధ్యాహ్న భోజనాన్ని పరిశీలిస్తున్న డీఈవో రాధాకిషన్

శివ్వంపేట, జనవరి 10: అన్ని ప్రభుత్వ పాఠశాలల్లో పదో తరగతిలో వంద శాతం ఉత్తీర్ణత సాధించేలా ఉపాధ్యాయులు ప్రణాళికలు రూపొందించాలని డీఈవో రాధాకిషన్ అన్నారు. శుక్రవారం శివ్వంపేట కేజీబీవీతో పాటు చిన్నగొట్టిముక్ల, పాంబండ పాఠశాలలను సందర్శించారు. మధ్యాహ్న భోజనాన్ని పరిశీలించారు. రాబోయే రెండు నెలలు ప్రత్యేక తరగతుల్లో విద్యార్థుల సందేహాలను నివృత్తి చేయాలన్నారు. అనంతరం పాంబండ జడ్పీహెచ్ఎస్‌లో సంక్రాంతి సంబురాలు నిర్వహించారు. కార్యక్రమంలో ఎంఈవో బుచ్యానాయక్, హెచ్ఎంలు మోహన్‌రావు, ఇందుమతి, ఉపాధ్యాయులు సదన్‌కుమార్, శ్రీధర్‌రావు, వేణుగోపాల్‌రెడ్డి, చెన్నా, జగదీశ్ తదితరులు ఉన్నారు.

అటెండరే.. అక్కడ డాక్టర్

విద్యార్థులకు కట్టుకడుతున్న అటెండర్

శివ్వంపేట, జనవరి 10: డాక్టర్లు సమయపాలన పాటించకుండా విధులు నిర్వహించడంతో ప్రభుత్వ దవాఖానకు వచ్చే రోగుల పరిస్థితి దయనీయంగా మారింది. శుక్రవారం పలువురు విద్యార్థులు గాయాలతో శివ్వంపేట దవాఖానకు వచ్చారు. అక్కడ డాక్టర్లు లేక పోవడంతో అటెండరే వారికి కట్టుకట్టి పంపించాడు. డాక్టర్లు సమయానికి రాకపోవడంతో రోగులు ఇబ్బందులు పడుతున్నారని, ఉన్నతాధికారుల పర్యవేక్షణ లేక పోవడంతోనే ఇలా జరుగుతున్నదని పలువురు ఆరోపిస్తున్నారు.

షార్ట్ సర్క్యూట్‌తో పెంకుటిల్లు దగ్ధం

ఇంటిని పరిశీలించి వివరాలు నమోదు చేస్తున్న ఆర్ఐ నర్సింగ్‌యాదవ్

వెల్దుర్తి, జనవరి 10: విద్యుత్ షార్ట్ సర్క్యూట్‌తో నివాస పెంకుటిల్లు దగ్ధమైన ఘటన మండలంలోని ధర్మారం గ్రామంలో శుక్రవారం జరిగింది. బాధితులు, ఆర్ఐ నర్సింగ్ యాదవ్ తెలిపిన వివరాల ప్రకారం.. టంటం నవీన్, టంటం ప్రభాకర్ ఇద్దరు అన్నదమ్ములు. రెండు ఇండ్లలో ఎవరూలేని సమయంలో ఒక్కసారిగా మంటలు అంటుకున్నాయి. చుట్టుపక్కల వారు ఫైరింజిన్‌కు సమాచారం ఇచ్చారు. ఫైరింజిన్ వచ్చి మంటలు ఆర్పేశారు. అప్పటికే ఇంట్లో ఉన్న టీవీ, బియ్యం, బట్టలు, వంట సామగ్రి, పలు పత్రాలు కాలిపోయాయి. విషయం తెలుసుకున్న ఆర్ఐ నర్సింగ్‌యాదవ్ ఘటనా స్థలానికి వెళ్లి ఇంటిని పరిశీలించి, వివరాలు నమోదు చేశారు.

అందోల్ నుంచి అజ్జమర్రి బీటీ రోడ్డు సర్వే

చిలిపిచెడ్, జనవరి 10: సంగారెడ్డి జిల్లా అందోల్ నియోజకవర్గం జోగిపేట నుంచి మంజీరా నదిలో బ్రిడ్జితో పాటు చిలిపిచెడ్ మండలం అజ్జమర్రి బీటీ రోడ్డు వరకు మంజూరైన బీటీ రోడ్డు పనుల కోసం సర్వే చేస్తున్నట్లు సర్వేయర్ రవిప్రసాద్ శర్మ, మాజీ సర్పంచ్ పరశురాంరెడ్డి తెలిపారు. అజ్జమర్రి గ్రామంలో రైతుల పొలాల్లో నుంచి బీటీ రోడ్డు వేసేందుకు రైతులంతా ఒప్పుకున్నారని వారు తెలిపారు.

సీఎంఆర్ఎఫ్ చెక్కు అందజేత

నిజాంపేట, జనవరి 10: మండలంలోని వెంకటాపూర్(కె) గ్రామానికి చెందిన కృష్ణకు రూ.46 వేల సీఎంఆర్ఎఫ్ చెక్కు మంజూరైనది. శుక్రవారం స్థానిక నాయకులు బాధితుడికి చెక్కు అందజేశారు. కార్యక్రమంలో నాయకులు సత్యనారాయణ రెడ్డి, మధుసూదన్‌రెడ్డి, భాస్కర్ ఉన్నారు.

తీగుల్ పాఠశాలలో హిందీ దివస్

జగదేవపూర్, జనవరి 10: మండలంలోని తీగుల్ ఉన్నత పాఠశాలలో శుక్రవారం హిందీ దివస్‌ను ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా ప్రధానోపాధ్యాయురాలు అనసూయ మాట్లాడుతూ హిందీ భాషను ప్రపంచ వ్యాప్తంగా గుర్తించడం సంతోషకరమైన విషయమన్నారు. ప్రపంచవ్యాప్తంగా వివిధ దేశాల్లో మాట్లాడే భాషల్లో హిందీ భాష మూడో స్థానంలో ఉందన్నారు. హిందీ దివస్‌ను పురస్కరించుకొని విద్యార్థులకు క్విజ్, ఉపన్యాస పోటీలు నిర్వహించి బహుమతులు అందజేశారు. కార్యక్రమంలో హిందీ టీచర్ సంధ్య, ఉపాధ్యాయులు, విద్యార్థులు పాల్గొన్నారు.

తీగుల్ పాఠశాలలో హిందీ దివస్‌ను పురస్కరించుకొని ప్రదర్శిస్తున్న విద్యార్థులు

ఘనంగా ముగిసిన కాంక్రీక్ కానో పోటీలు

పడవల పోటీల్లో పాల్గొన్న విద్యార్థులు

పడవల పోటీలను వీక్షిస్తున్న అధ్యాపక బృందం, విద్యార్థులు

నర్సాపూర్, జనవరి 10: నర్సాపూర్‌లోని బీవీఆర్ఐటీ కళాశాలలో జాతీయ స్థాయి విష్ణు నేషనల్ కాంక్రీట్ కానో పడవల రేసింగ్ పోటీలు రెండో రోజు ఘనంగా ముగిశాయి. ఈ కార్యక్రమానికి విష్ణు ఎడ్యుకేషనల్ సొసైటీ వైస్ చైర్మన్ ఆర్.రవిచంద్రన్ రాజగోపాల్ ముఖ్య అతిథిగా హాజరయ్యారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ రెండో రోజు క్యాంపస్‌లో పడవల పోటీల్లో విద్యార్థులు ఉత్సాహంగా పాల్గొన్నారన్నారు. టెక్నాలజీకి అనుగుణంగా సస్టైనబుల్ నిర్మాణ సామగ్రి, ఆచరణల ప్రాముఖ్యతపై దృష్టి సారించి ఇంజినీర్లు సమకాలీన సవాళ్లను ఎదుర్కోవడానికి సృజనాత్మకంగా ఆలోచించాలని సూచించారు. అనంతరం పడవల ఇంజినీరింగ్ డిజైన్, పాల్గొనే వారి నైపుణ్యం గురించి విద్యార్థులను అడిగి తెలుసుకున్నారు. తరువాత ఎండ్యూరెన్స్ రేస్ పడవల పోటీలను జెండా ఊపి అధికారికంగా ప్రారంభించారు. రెండో రోజు తెలంగాణ, ఆంధ్రప్రదేశ్, కర్ణాటక, తమిళనాడు రాష్ట్రాల నుంచి 16కు పైగా బృందాలు రేస్‌లో పాల్గొన్నాయి.

ఈ పోటీల్లో మొదటి బహుమతి బీవీఆర్ఐటీ సివిల్ ఇంజినీరింగ్ విద్యార్థులు, రెండో బహుమతి రాజీవ్ గాంధీ యూనివర్సిటీ ఆఫ్ నాలెడ్జ్ టెక్నాలజీస్ బాసర, మూడో బహుమతి విష్ణు ఇనిస్టిట్యూట్ ఆఫ్ టెక్నాలజీ భీమవరం, విజ్ఞాన భారతి ఇనిస్టిట్యూట్ ఆఫ్ టెక్నాలజీ హైదరాబాద్ విద్యార్థులకు వచ్చాయి. విజేతలను కాలేజ్ యాజమాన్యం, డైరెక్టర్, ప్రిన్సిపాల్, సివిల్ విభాగాధిపతి అభినందించారు. బీవీఆర్ఐటీ కళాశాల క్యాంపస్‌ను రోచెస్టర్ ఇనిస్టిట్యూట్ ఆఫ్ టెక్నాలజీ(ఆర్ఐటీ) నుంచి ప్రొఫెసర్ క్రిస్టోఫర్ కొల్లిసన్ సందర్శించారు. కెమిస్ట్రీలో ఆర్టిఫిషియల్ ఇంటలిజెన్స్ ఎలా పనిచేస్తుందో విద్యార్థులను అవగాహన కల్పించారు. కార్యక్రమంలో కళాశాల డైరెక్టర్ డా.లక్ష్మీప్రసాద్, ప్రిన్సిపాల్ డా.సంజయ్ దూబే, సివిల్ ఇంజినీరింగ్ హెడ్ ఆఫ్ ది డిపార్ట్‌మెంట్ డా.ఎస్.కృష్ణరావు, ఇండస్ట్రీ రిలేషన్స్ డైరెక్టర్ పరుచూరి సతీశ్‌చంద్ర, ఉన్నత విద్యా మండలి కో-ఆర్డినేటర్ ప్రణీత, అన్ని విభాగాల హెచ్‌వోడీలు, డీజీఎం కాంతారావు, మేనేజర్ బాపిరాజు, అశోక్‌రెడ్డి, సురేశ్, సిబ్బంది పాల్గొన్నారు.

సర్కారు బడుల్లో సంక్రాంతి సంబురాలు

నిజాంపేట: నందగోకుల్ పాఠశాల ఆవరణలో రంగు రంగుల ముగ్గులతో విద్యార్థులు, ఉపాధ్యాయులు

రామాయంపేట జూనియర్ కళాశాలలో ముగ్గులను పరిశీలిస్తున్న ప్రిన్సిపాల్, లెక్చరర్ల బృందం

చిలిపిచెడ్: సోమక్కపేట పాఠశాలలో ముగ్గులు వేస్తున్న విద్యార్థులు.. పరిశీలిస్తున్న ఎంఈవో విఠల్

- ఆకట్టుకున్న రంగవల్లులు, గంగిరెద్దుల విన్యాసాలు, భోగి మంటలు
- ముందస్తు సంబురాల్లో విద్యార్థులు

రామాయంపేట/నిజాంపేట/నర్సాపూర్/చిన్నశంకరంపేట/చిలిపిచెడ్/పాపన్నపేట/మెదక్‌రూరల్, జనవరి 10: ప్రభుత్వ పాఠశాలలు, కళాశాలల్లోని విద్యార్థులు ముందస్తు సంక్రాంతి సంబురాలు జరుపుకొన్నారు. విద్యార్థులు నూతన వస్త్రాలు ధరించి పాఠశాల, కళాశాలల ఆవరణలో రంగురంగుల ముగ్గులు వేసి గాలి పటాలు ఎగురవేశారు. ముగ్గుల్లో ప్రతిభ కనబర్చిన వారికి ప్రథమ, ద్వితీయ, తృతీయ బహుమతులు అందజేయనున్నట్లు నిర్వాహకులు తెలిపారు. పాఠశాల ఆవరణలో పాలు పొంగించారు. భోగి మంటలు వేసుకున్నారు. హరిదాసు వేశధారణలో విద్యార్థులు చూపరులను ఆకట్టుకున్నారు.

శివ్వంపేట: పాంబండ పాఠశాలలో భోగిమంటలు మండిస్తున్న డీఈఓవో రాధాకిషన్

మెదక్ రూరల్: మంబోజిపల్లిలోని గీతా పాఠశాలలో సంకాంత్రి సంబురాల్లో పాల్గొన్న ఉపాధ్యాయులు

మరికొన్ని పాఠశాలల్లో గొబ్బెమ్మలు చేసి, కోలాటం ఆడి అందరినీ అలరించారు. నర్సాపూర్‌లోని విష్ణు ఉన్నత పాఠశాలలో గౌరీ పూజ చేశారు. గంగిరెద్దుల విన్యాసాలు, భోగిమంటలు, గొబ్బెమ్మలు, రంగవల్లులు, సంక్రాంతి శోభను ప్రతిబింబించాయి. విద్యార్థుల సాంస్కృతిక కార్యక్రమాలు విశేషంగా ఆకట్టుకున్నాయి.

నర్సాపూర్: బ్రాహ్మణపల్లిలో ముగ్గులు వేస్తున్న సర్కారు బడి విద్యార్థినులు

పాపన్నపేట: ముగ్గులు వేస్తున్న చిన్నారులు

నర్సాపూర్: విష్ణు ఉన్నత పాఠశాలలో..

చిన్నశంకరంపేట: భోగి మంటలను నిర్వహిస్తున్న ప్రభుత్వ పాఠశాల విద్యార్థులు

సంక్రాంతికి ఊరెళ్తున్నారా.. జరభద్రం

ఎస్పీ ఉదయ్‌కుమార్‌రెడ్డి

మెదక్ అర్బన్, జనవరి 10: సంక్రాంతి పండుగ దృష్ట్యా చోరీల నియంత్రణకు అన్ని చర్యలు చేపట్టినట్లు ఎస్పీ ఉదయ్‌కుమార్‌రెడ్డి శుక్రవారం ప్రకటనలో తెలిపారు. రాత్రి వేళలో వీధుల్లో గస్తీ ఏర్పాట్లు చేస్తున్నట్లు ప్రజలు కూడా జాగ్రత్తలు తీసుకోవాలని సూచించారు. దూర ప్రాంతాలకు వెళ్లే వారు తమ ఇంటి చిరునామా, ఫోన్ నెంబర్‌ను సంబంధిత పోలీస్ స్టేషన్‌లో తెలుపాలని పేర్కొన్నారు. దీంతో వారి వివరాలను రిజిస్టర్‌లో నమోదు చేసుకుని ఊరెళ్లిన వారి ఇండ్లపై నిఘాను ఏర్పాటు చేస్తామని తెలిపారు.

రోడ్డు ప్రమాదంలో ఇద్దరు స్నేహితులు మృతి

నాగరాజు (ఫైల్)

దుర్గాప్రసాద్ (ఫైల్)

నర్సాపూర్/శివ్వంపేట, జనవరి 10: రోడ్డు ప్రమాదంలో ఇద్దరు ప్రాణ స్నేహితులు మృతి చెందిన ఘటన నర్సాపూర్‌లో జరిగింది. పోలీసుల కథనం ప్రకారం.. శివ్వంపేట్ మండలం అల్లీపూర్ గ్రామానికి చెందిన పిట్ల నాగరాజు(26), కమ్మరి దుర్గాప్రసాద్(25) చిన్నప్పటి నుంచి ప్రాణ మిత్రులు. ఇద్దరిది ఒకే బేంచ్, ఒకే తరగతి, ఒకే స్కూల్ అనే మాదిరిగా సాగింది. పిట్ల నాగరాజు ఓ పౌల్ట్రీ కంపెనీలో సూపర్‌వైజర్‌గా పనిచేస్తున్నాడు. కమ్మరి దుర్గాప్రసాద్ వ్యవసాయం చేసుకుంటూ కుటుంబాన్ని పోషిస్తున్నాడు. శుక్రవారం కొంపల్లిలోని పౌల్ట్రీ కార్యాలయంలో సీడ్ చెకప్ కోసమని దుర్గాప్రసాద్‌ను వెంట తీసుకుని నాగరాజు బైక్‌పై వెళ్లాడు. పని ముగించుకుని తిరిగి వస్తుండగా నర్సాపూర్‌లోని ఎస్‌బీఐ సమీపంలోని జాతీయ రహదారిపై వస్తుండగా వెనకాల నుంచి ఓ లారీ అతివేగంగా వచ్చి వీరి బైక్‌ను బలంగా ఢీకొట్టింది. ఈ ప్రమాదంలో దుర్గాప్రసాద్ అక్కడికక్కడే మృతి చెందాడు. నాగరాజు దవాఖానకు తరలిస్తుండగా మార్గమధ్యలో మృతిచెందాడు. నాగరాజుకు భార్య మేఘమాల, ఏడాది వయస్సున్న కూతురు ఉంది. దుర్గాప్రసాద్‌కు భార్య సారికతో పాటు మూడు నెలల కూతురు ఉన్నారు. ఇద్దరి మృతితో అల్లీపూర్‌లో విషాదఛాయలు అలుముకున్నాయి.

అక్రమాలకు పాల్పడిన వారిపై చర్యలు తీసుకుంటాం


ప్రజావేదికలో అధికారులతో మాట్లాడుతున్న ఉపాధి హామీ కూలీలు

- డీఆర్డీఏ ఏపీడీ రంగాచార్యులు
- కౌడిపల్లిలో ఎన్ఆర్ఈజీఎస్ సామాజిక తనిఖీ
- సోషల్ ఆడిట్‌లో అక్రమాలు జరిగినట్లు నిర్ధారణ

కౌడిపల్లి, జనవరి 10: ఉపాధి హామీ పథకంలో అక్రమాలకు పాల్పడిన వారిపై చర్యలు తీసుకుంటామని డీఆర్డీఏ అడిషనల్ పీడీ రంగాచార్యులు అన్నారు. శుక్రవారం మండల కేంద్రంలో 15వ సామాజిక తనిఖీ ప్రజావేదిక నిర్వహించారు. మండలంలోని 29 పంచాయతీలకు 2023-24 సంవత్సరానికి ఈజీఎస్ ద్వారా 275 పనులకు రూ.5కోట్ల 79 లక్షల 35వేల 596, పంచాయతీ రాజ్ ద్వారా 2కోట్ల68లక్షల 47వేల582, అటవీ శాఖ ద్వారా రూ.5లక్షల 31వేల 38లు కర్చు చేశారు. వెల్మకన్న గ్రామంలో ఒకరి పేర్ల మీద మరొకరు పని చేశారని, పనులు చేయకున్నా కొందరి పేర్ల మీద డబ్బులు తీసుకున్నారని గ్రామానికి చెందిన పలువురు కూలీలు అదికారుల దృష్టికి తీసుకొచ్చారు. స్పందించిన అధికారులు ఫీల్డ్ అసిస్టెంట్‌ను వివరణ ఇవ్వాలని తెలిపారు. ఇదే తరహాలో పలు గ్రామాల్లో పెద్ద మొత్తంలో అక్రమాలకు పాల్పడినట్లు ఆడిట్ అధికారులు ప్రజా దర్బార్‌లో వివరించారు ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ అవినీతికి పాల్పడినట్లు రుజువైతే వారి నుంచి రికవరీతో పాటు చర్యలు తీసుకుంటామన్నారు. కార్యక్రమంలో విజిలెన్స్ అధికారి శ్రీహరి, విజిలెన్స్ ఎగ్జిక్యూటీవ్ సంపత్, స్టేట్ మానిటర్ దత్తు, ఎస్పీఎమ్ అశోక్, హెచ్ఆర్ మేనేజర్ రాజేందర్‌రెడ్డి, జూనియర్ క్వాలిటీ కట్రోలర్ అరుణ, ఎంపీడీవో శ్రీనివాస్, ఏపీవో పుణ్యదాస్, పీఆర్ఏఈ ప్రభాకర్, పంచాయతీ సెక్రెటరీలు, ఈజీఎస్ సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

కేజీబీవీలో హిందీ సీఆర్టీ పోస్టుకు దరఖాస్తుల స్వీకరణ

పాపన్నపేట, జనవరి 10: పాపన్నపేట కేజీబీవీలో హిందీ సీఆర్టీ పోస్టులో తాత్కాలింగా పని చేసేందుకు ఆసక్తి గల మహిళా అభ్యర్థులు దరఖాస్తు చేసుకోవాలని స్పెషల్ అధికారి బాలలక్ష్మి శుక్రవారం ప్రకటనలో కోరారు. బీఎడ్, హెచ్‌పీటీ, హిందీ సబ్జెక్టుతో ఉత్తీర్ణులైన అభ్యర్థులు శనివారం సాయంత్రం వరకు పాపన్నపేట కేజీబీవీలో దరఖాస్తు చేసుకోవాలని సూచించారు.

విద్యార్థులకు దంత పరీక్షలు

చేగుంట, జనవరి 10: చేగుంట జడ్పీహెచ్ఎస్‌లోని విద్యార్థులకు వైబీ డెంటల్ మల్టీ స్పెషలిటీ దవాఖాన వారి ఆధ్వర్యంలో శుక్రవారం వైద్య శిబిరం నిర్వహించారు. డాక్టర్ సతీశ్, మనోజ్ఞ, వారి సిబ్బంది రాజు, లత విద్యార్థులకు దంత పరీక్షలు చేశారు. ఇన్‌చార్జి హెచ్ఎం రఘుపతి, రాజేశ్వర్, సుధాకర్‌రెడ్డి, శారద, చల్లా లక్ష్మణ్, మనోహర్‌రావు, వెంకటేశ్ పాల్గొన్నారు.

చీడపీడలపై అప్రమత్తంగా ఉండాలి

అవగాహన కల్పిస్తున్న అధికారి

రామాయంపేట, జనవరి 10: రైతులు వరి పంటలో కాండం తొలుచు పురుగు పట్ల జాగ్రత్తలు పాటించాలని రామాయంపేట ఇన్‌చార్జి వ్యవసాయ శాఖ అధికారి రాజ్‌నారాయణ అన్నారు. శుక్రవారం పంటలను పరిశీలించి చీడపీడలపై పలు సలహాలిచ్చారు. ప్రతి రైతు తమ పొలాల్లో నీటిని తక్కువగా వాడాలన్నారు. పంటకు నీరు ఎక్కువగా పారించడంతో కూడా చీడపీడలు వస్తాయన్నారు.

ఐక్యంగా ఉంటేనే ముదిరాజ్ సమస్యల పరిష్కారం

శివ్వంపేట, జనవరి 10: ముదిరాజ్‌లంతా ఐక్యంగా ఉంటనే సమస్యలు పరిష్కరించుకోవచ్చని ఆ సంఘం మండలాధ్యక్షుడు లక్ష్మీనర్సయ్య అన్నారు. శుక్రవారం మండలంలోని గంగాయిపల్లి గ్రామ కమిటీ అధ్యక్షుడిగా దాసరి నాగరాజును, నూతన కమిటీని ఎన్నుకున్నారు. కార్యక్రమంలో మండల సలహాదారుడు పొల్దాస్ వెంకటస్వామి, గ్రామ కమిటీ ఉపాధ్యక్షులు సంజీవ, సురేశ్, యాదగిరి, సత్యనారాయణ, రమాకాంత్, తలారి నర్సింలు, బొట్టు మల్లేశ్, అశోక్, తదితరులు ఉన్నారు.

విద్యార్థులకు టై, బెల్టులు అందజేత

శివ్వంపేట, జనవరి 10: మండలంలోని పిల్లుట్ల జడ్పీహెచ్ఎస్‌లో విద్యార్థులకు బుర్ర మురళీగౌడ్ శుక్రవారం టై, బెల్టులు అందజేశారు. కార్యక్రమంలో ఎస్ఎంసీ చైర్మన్ పిల్లి మధు, రాఘవరెడ్డి, పెద్దపులి సతీశ్, దినేశ్‌రెడ్డి, శంకర్, కన్నయ్య, బాసంపల్లి నర్సింలు, వినయ్ ఉన్నారు.

సమ్మె నోటీసు అందజేత

చిన్నశంకరంపేట, జనవరి 10: ఎంపీడీవో కార్యాలయంలో శుక్రవారం గ్రామ పంచాయతీ పారిశుద్ధ్య కార్మికులు శుక్రవారం సమ్మె నోటీసు అందజేశారు. ఆరు నెలలుగా తమకు వేతనాలు రాక తీవ్ర ఇబ్బందులకు గురవుతున్నామని ఆవేదన వ్యక్తం చేశారు. వేతనాలు లేక పస్తులుండాల్సిన దుస్థితి నెలకొన్నదన్నారు. వెంటనే ప్రభుత్వం వేతనాలు చెల్లించకుంటే సమ్మెలో పాల్గొంటామని హెచ్చరించారు.

చైనా మాంజా అమ్మడం చట్టరీత్యా నేరం

రేగోడ్, జనవరి 10: చైనా మాంజా అమ్మడం చట్టరీత్యా నేరమని ఎస్సై పోచయ్య శుక్రవారం ప్రకటనలో తెలిపారు. గాలిపటాలు ఎగురవేసే క్రమంలో రోడ్లపైకి రావడంతో వాహనాదారులకు తగిలి గాయాలయ్యే అవకాశం ఉన్నదన్నారు. చైనా మాంజా అమ్మిన వ్యక్తులపై కేసు నమోదు చేసి, ఐదేండ్లు జైలు శిక్ష పడేలా చేస్తామన్నారు.

వివేకానందుడి బాటలో నడుద్దాం

రామాయంపేట, జనవరి 10: స్వామి వివేకానంద బాటలో ప్రతిఒక్కరం నడవాలని ఏబీవీపీ మెదక్, సిద్దిపేట జిల్లాల సంఘటన మంత్రి లక్ష్మీపతి అన్నారు. శుక్రవారం పట్టణంలోని విద్యార్థులతో ఏబీవీపీ నాయకులు పెద్ద ఎత్తున ర్యాలీని ప్రారంభించి, సిద్దిపేట చౌరస్తాలోని స్వామి వివేకానంద జయంతి వేడుకల్లో భాగంగా ఆయన విగ్రహానికి నివాళులర్పించారు. కార్యక్రమంలో రాష్ట్ర కార్యవర్గ సభ్యుడు బండారి ప్రశాంత్, హరిహర, ఆదర్శ, కిరణ్, నవీన్, అరుణ్, శశాంక్, వంశీ, దీక్షిత్ తదితరులున్నారు.

నమస్తే తెలంగాణ క్లాసిఫైడ్స్

LOST
I, Mrs. NASREEN SULTANA, D/o. Late Syed Habibuddin, R/o. Q.No. 53/B, BHEL Township, Ramachandrapuram, Sanga Reddy -502032, T.S. I have Lost my Passport No. E4950674, My Passport was lost at Near BHEL Circle, by shifting house from Q.No. 53B to Q.No. 28D, BHEL, R.C.Puram On 30-10-2023. If Anybody Found Please Contact:
9030269695

గమనిక: క్లాసిఫైడ్ ప్రకటనలకు ప్రతిస్పందించే ముందు తగిన రీతిలో క్షుణ్ణంగా విచారించుకోవలసిందిగా పాఠకులకు సూచించడమైనది. ప్రకటనదారు చెబుతున్న లేదా చేసుకుంటున్న క్లెయిములతో నమస్తే తెలంగాణ పత్రికకు ఏ విధమైన సంబంధం లేదు. బ్యాంక్ అకౌంట్ల ద్వారా డబ్బులు ట్రాన్స్‌ఫర్/డిపాజిట్ చేయవద్దు. పాఠకులు ఈ విషయాన్నీ గమనించగలరు.